

# 11

## సర్వజిత్

సినిమా ప్రారంభమై అప్పటికి అరగంటపైనే అయింది. హాల్లో పెద్దగా జనం లేరు. అంతకు ముందు అదే డైరెక్టర్ తీసిన సినిమా కొత్త ట్రెండ్‌తో విజయ వంతమైంది. కానీ, ఈ సినిమాకి మాత్రం జనం లేరు. పల్చగా ఉన్నారు. తెలుగువాడి సస్పెన్స్ ఫార్ములా ఏ సినిమాకి ఎలా ఉంటుందో డైరెక్టర్లను పుట్టించిన, లేదా కాబోయే డైరెక్టర్లను పుట్టించిన ఆ బ్రహ్మకి కూడా అర్థం కాదనటానికి ఆ సినిమా ఓ ఉదాహరణ.

ఎందుకంటే ఆ సినిమా మీద రివ్యూలు బాగానే వచ్చాయి మరి. కానీ, జనాల్ని ఆకట్టుకోలేకపోతోంది. అయితే అలాంటి సినిమాలంటేనే ఋత్విక్‌కి ఇష్టం. కనుకనే భార్య అపర్ణని పనిగట్టుకుని ఆ సినిమాకి తీసుకొచ్చాడు.

అరగంట అయిన దగ్గర్నుంచీ భార్య సణగడం ప్రారంభించింది –

"మీకు నచ్చిన సినిమా అన్నప్పుడే అనుకున్నాను అదేదో ఆర్టు సినిమా అయ్యుంటుందని. పోన్లెండి ఇంట్లో ఎ.సి. ఎలానూ పెట్టించడం లేదు కదా ! ఓ రెండు గంటలసేపు ఎ.సి.లో నిద్రపోతాను.." అంటూ ఆమె ఆవులించింది.

"అలాక్కాదు. కొంచెం ఓపిగ్గా చూడు బాగుంటుంది...." అంటున్నాడు ఋత్విక్.

'ఎంచక్కా సిటీలో ఇంకా మంచి సినిమాలుంటే ఈ సినిమానే దొరికిందా ఈయనకి?' అని విసుక్కుంటూ అప్పుడప్పుడు కునికిపాట్లు పడుతూ, మధ్యమధ్యలో సినిమా చూస్తోంది అపర్ణ.

# అనుభవం



ఇంతలో వాళ్ళు కూర్చున్న కుర్చీలు ఎవరో ఊపుతున్నట్లనిపించింది. అటూ ఇటూ చూశాడు ఋత్విక్. ఊగడం తగ్గింది. పది నిముషాలకి మళ్లీ మొదలు. వెనక్కి చూశాడు. వెనక సీట్లో కూర్చున్న వ్యక్తి రెండు కాళ్లూ అతనికి రెండు కుర్చీల అవతల ఎదురు కుర్చీపై పెట్టి, బాగా వెనక్కి జారబడి కూర్చుని కాళ్లు ఊపుతున్నాడు.

ఋత్విక్ వెనక్కి చూడ్డంతో ఆ వ్యక్తి కాళ్ళూ పడం మానేశాడు. కానీ, మళ్లీ పది నిముషాలకి అదే ధోరణి. అదే వరుసలో నాలుగు సీట్లు అవతల కూర్చున్నవాళ్లూ అసహనంగా వెనక్కి చూశారు.

"సార్ ! కాళ్లు తీస్తారా ?" అన్నాడు ఋత్విక్.

అతను ఏమనుకున్నాడో, కాళ్లు ఎదురు సీటు మీంచి తీసి, మోకాళ్లు రెండూ మడిచి ఎదురు సీటుకి ఆన్చి అలానే కూర్చున్నాడు సెల్‌ఫోన్ మాట్లాడుతూ. పది నిముషాలకి మళ్లీ అదే ధోరణి. మోకాళ్ళ ఊపడంతో ఎదురు సీట్లు కదులుతూ కూర్చోవడం చికాగ్గా అనిపించసాగింది ఋత్విక్‌కి.

"సార్ ! మీరలా ఊపుతుంటే మాకు చాలా డిస్ట్రబెన్స్‌గా ఉంది. ప్లీజ్ కాళ్లు టచ్ చెయ్యకండి." అన్నాడు అసహనంగా.

ఆ మాటతో వెనుక సీటతను ఏం మాట్లాడలేదు. కాళ్లు కింద పెట్టాడు. కింద అంటే నేలమీద కాదు. సీటుకి కొంచెం కిందగా, కానీ అలానే కూర్చున్నాడు బాగా వెనక్కి జారబడి, సీట్లోసగం కృంగిపోయినట్లు.

నిజానికి అతను సినిమా చూస్తున్నట్లు లేదు. అపర్ణ అన్నట్లు కాస్సేపు ఎ.సి.థియేటర్‌లో పడుకోవడానికి వచ్చినట్లుంది. సినిమా నడుస్తూనే ఉంది. ప్రేక్షకుల నుంచి ఏ రకం రెస్పాన్సు లేదు. అప్పుడప్పుడు నిట్టూర్పులు మాత్రం వినిపిస్తున్నాయి. పావుగంటకి ఇంటర్వెల్ ఇస్తాడనగా మళ్లీ సీట్లు ఊగడం ప్రారంభమయ్యాయి.

ఋత్విక్‌కి చాలా కోపం వచ్చింది. 'ఏంటి ఈ మనిషి ధోరణి' అన్నట్లు వెనక్కి చూశాడు. అతను వెనక్కి చూసినప్పుడు ఆ వ్యక్తి కాళ్లు ఊపడం మానేస్తున్నాడు. ఋత్విక్ ఏదో అనబోతుంటే అపర్ణ భర్తని ఏం మాట్లాడద్దన్నట్లు చేయి నొక్కింది. ఇంతలో ఇంటర్వెల్ ఇచ్చారు. లైట్లు వెలిగాయి. వెనుక సీటతను కుర్చీలో సర్దుకుని కూర్చున్నాడు. ఋత్విక్ వెనక్కి తిరిగి అతన్ని చూశాడు. మనిషి చూడ్డానికి రఫ్‌గా ఉన్నాడు. ఋత్విక్ అలా వెనక్కి చూడ్డంతో అపర్ణ భయపడింది. అతనితో భర్త ఎక్కడ గొడవ పెట్టుకుంటాడోనని.

ఆమె కంగారు పడింది. 'ఏమీ మాట్లాడవద్దన్నట్లు భర్తకి సౌంజ్ఞ చేసింది. సీట్లోంచి లేచింది. భర్తని కూడా లెమ్మని కళ్ళతోనే చెబుతూ, థియేటర్ ఖాళీగా ఉండడంతో మూడు వరుసలు ముందుకెళ్లి కూర్చుంది. ఏమీ మాట్లాడకుండా ఋత్విక్ భార్యతో వెళ్ళి కూర్చున్నాడు.

'డర్టీ ఫెలోస్.... పక్కవాడిని ఇబ్బంది పెడుతున్నాం అని కూడా అర్థం కాదనుకుంటాను. ఆ మాత్రం కామన్‌సెన్స్ లేకుండా ఎలా ఉంటారో....' ఋత్విక్ ముందుకు వచ్చి కూర్చున్నాక విసుక్కున్నాడు.

అలాంటి విషయాలు ఋత్విక్ సహించలేడు. వాళ్లకి క్లాసు పీకుతాడు. కొందరు తేలిగ్గా తీసుకుంటారు. మరికొందరు 'పోవోయ్ చెప్పొచ్చావ్.... అపరిచితుడు సినిమాలో హీరోననుకుంటున్నావా?" అని వెటకారంగా తీసి పారేస్తుంటారు.

కూరల మార్కెట్‌లో, బజార్లో, చాలా సందర్భాల్లో చిన్న చిన్న విషయాల్నే పెద్దగా చేస్తూ అవతలవాళ్లకి ఋత్విక్ క్లాస్ తీసుకోవడం అపర్ణకు అనుభవమే. కొందరయితే గొడవ పడిన సందర్భాలున్నాయి.

అతనిలో ఈ ధోరణి ఇప్పటిది కాదు. పెళ్లయినప్పట్నుంచీ ఆమె గమనిస్తూనే ఉంది. కొందరు చాదస్తం అన్నారు. మరికొందరు అదోరకం పిచ్చి అన్నారు. ఎవరు ఏమనుకున్నా అతని ధోరణి అతనిదే.

సినిమా టిక్కెట్ల దగ్గర క్యూలోగాని, గుడీ గోపురాల దగ్గర క్యూలోగానీ, ఎవరేనా ముందుకు వెళ్ళి క్యూలో దూరితే చాలు అతనిక ఊరుకోలేడు. వాళ్లని పిలిచి, లేదా వాళ్ల దగ్గరికి వెళ్లి క్లాసు తీసుకుంటాడు.

'మీరొచ్చింది గుడికి. పవిత్రంగా వెళ్లాల్సిన చోటుకి. ఇక్కడ కూడా చాలా అడ్డదారిన దేముడి దగ్గరికి వెళితే ముక్తి లభిస్తుందా. దేముడు హర్షిస్తాడా.... చేసే పనిలో చిత్తశుద్ధి ఉండాలి మాస్టారూ....' అంటాడు.

ఒక్కొక్కళ్ళయితే చేసిన తప్పుకి ఏమీ మాట్లాడరు. నవ్వి ఊరుకుంటారు. మరికొందరయితే వాదనకు దిగుతారు. 'చేతనయితే ముందుకెళ్లి మీరూ లైన్లో దూరండి. చేతగాకపోతే ఊరుకోండి. మడిగట్టుకు కూర్చుంటే కుదర్దు. వి.ఐ.పి. దర్శనాలంటే ఏంటి.... అవీ అడ్డగోలుగా వెళ్లడమే... చాల్లెల్లే... చెప్పొచ్చావ్' అంటూ ఎద్దేవా చేస్తారు.

"అబ్బ వాళ్ల సంగతి మనకెందుకు. మీ మానాన మీరు క్యూలో నిల్చున్నారు కదా.... మీరు సిస్టమేటిక్‌గానే వెళ్లండి బాబూ..." అని అపర్ణ విసుక్కుంటుంది. రాను రానూ భర్తతో బజారుకు వెళ్లాలన్నా చికాగ్గా అనిపించ సాగిందామెకు.

ట్రాఫిక్ సిగ్నల్స్ దగ్గర అందరూ స్కూటర్లు, బళ్లూ ఆపి ఉన్న సమయంలో, కొద్దిపాటి జాగాలోంచి మెలికలు తిరిగిపోతూ సైకిల్‌నో, మోటార్‌బైక్‌నో ముందుకు తీసుకొచ్చి ఆపే వాళ్లని చూసినా, పోలీసువాడు చూడటంలేదని అడ్డగోలుగా సిగ్నల్‌కి ఖాతరు చేయకుండా బండిని పోనిచ్చే వాళ్లని చూసినా ఋత్విక్‌కి చచ్చేంత కోపం వస్తుంది. ఊరికే టెన్షన్

అనవసర భయాలతో వీళ్లందర్నీ ఇబ్బంది పెట్టేస్తున్నానా అనుకున్నాడు ఋత్విక్. కానీ, మనస్సు అంగీకరించలేదు. ప్రలోభాలు కొండంత... ప్రయత్నం ఆవగింజంత. అది మొలకై, మహా వృక్షమైనప్పుడే... సమాజానికి మంచి జరుగుతుందనుకున్నాడు.....

పడిపోతాడు.

ఓసారి... ట్రాఫిక్ సిగ్నల్ దగ్గర రెడ్ సిగ్నల్ పడడంతో వాహనాలు ఆగి ఉన్నాయి. ఓ కుర్రాడు వెహికిల్‌ని మెలికలు తిప్పుకుంటూ ముందుకు తీసుకువచ్చి ఆపాడు. అతను హెల్మెట్ పెట్టుకోలేదు. పైగా ఇయర్ ఫోన్స్ పెట్టుకుని సెల్‌లో మాట్లాడు తున్నాడు. మధ్యమధ్యలో 'ఓర్నియమ్మా...' అంటున్నాడు.

అతనికేసి చూశాడు ఋత్విక్. అతను ఈ ప్రపంచంలో లేనట్లున్నాడు. ఋత్విక్ అతన్ని కొంచెం పరిశీలనగా చూస్తే, అతను తన ఆఫీసులో తన కొలీగ్ కొడుకే. గుర్తుపట్టాడతన్ని. అలా చూస్తుండగానే, ఇంకా అక్కడ సిగ్నల్ పడకపోయినా, రయ్‌మని బండి పోనిచ్చాడు.

అంతే ! క్షణంలో తప్పింది ప్రమాదం ! మారుతీ కారుకి డ్యాష్ ఇవ్వబోయాడు. విజిలేసుకుంటూ గబగబా పోలీసు వచ్చేలోగా బండిని దూకించి అందకుండా వెళ్లిపోయాడు.

"ఏరా ఇంటిదగ్గర చెప్పొచ్చావా... చస్తావ్ నా....." అని మారుతీకారు డ్రైవరు అరుస్తున్నాడు. అంతకన్నా కొంచెం ఎక్కువ భాషలో పోలీసు కూడా తిడుతున్నాడు.

ఆ సంఘటన చూసిన ఋత్విక్ గుండె క్షణం వేగంగా కొట్టుకుంది. అక్కడ మహా అయితే సిగ్నల్ పడటానికి ముప్పయి సెకన్లు చాలు. ఆ మాత్రం కూడా ఆగలేని జనాల్ని చూస్తుంటే చచ్చేంత కోపం వస్తుందతనికి.

"క్షణంలో తప్పింది రామారావ్ ! మీ వాడు హాస్పటల్‌కో, ఆ పైలోకాలకో పోయేవాడు...." ఆఫీసుకు వెళ్లగానే తన కొలీగ్ రామారావుతో అన్నాడు ఋత్విక్.

"ఏమయ్యింది?" ఆదుర్దాగానే అడిగాడు రామారావు.

పావుగంట క్రితం ట్రాఫిక్ సిగ్నల్ దగ్గర తను చూసిన సంఘటన గురించి చెప్పాడు ఋత్విక్.

"అదా ! ఇవి మా వాడికి రోజూ మామూలే సార్. ఈ కాలం పిల్లలు అంతే... ఆ స్పీడు మనం తట్టుకోలేం...." అంతా విన్నాక తేలిగ్గా అనేశాడు రామారావు.

ఋత్విక్‌కి ఆశ్చర్యమేసింది - కనీసం కూడా బాధపడకుండా అలాగన్నందుకు. ఎంత ఈ కాలం పిల్లలయితే మాత్రం ప్రమాదాలు కొని తెచ్చుకోనడం కూడా ఒక థ్రిల్లేనా ! పెద్దవాళ్లుగా కనీసం మనం చెప్పాల్సిన బాధ్యత లేదా -

ఆ మాటే అడిగాడు రామారావుని. కానీ అతను దానిని సీరియస్‌గా తీసుకోలేదు.

"మనవల్ల కాద్సార్.... ఆ స్పీడులో వెళ్లక పోతే వాళ్లకి థ్రిల్లింగ్ ఉండదుట. హోమ్ థియేటర్‌లో పెద్ద సౌండ్‌లో వినకపోతేనూ థ్రిల్ ఉండదట. అనుభవించకపోతే ఇవన్నీ ఎందుకు తయారు చేసినట్టూ.... అంటారు ఈ తరం కుర్రకారు.... మనం ఎలాగూ ఎంజాయ్ చేయలేకపోయాం. లెట్‌దెమ్ ఎంజాయ్...." అనేసి, ఇక ఆ టాపిక్ చాలన్నట్లు ఆఫీసు ఫైళ్లలో తల దూర్చాడు రామారావు.

"నీ కెందుకయ్యా ! వాడి కొడుకు విషయంలో వాడికే జాగ్రత్త లేనప్పుడు?" ఆ ప్రక్క సీటు రామ్మూర్తి చిన్నగా అన్నాడు ఋత్విక్‌తో.

కానీ, అతను అలా అనుకోలేకపోయాడు. మన దృష్టికి వచ్చిన తప్పు ఏదైనా సరిదిద్దడానికి ప్రయత్నించడం మానవధర్మం అనుకుంటాడతడు. ఇళ్లలో హోమ్‌థియేటర్ సిస్టమ్ పెట్టుకుని పెద్ద వాల్యూమ్‌లో వినడం మంచిది కాదు. ధ్వనికాలుష్యం. ఇయర్‌ఫోన్స్ పెట్టుకుని మాట్లాడుతూ వెహికిల్ నడపడమూ మంచిది కాదు. మంచిది కాదని తెలిసీ ఎందుకు తయారు చేసి అమ్ముతున్నారు? పాలిథిన్ బ్యాగ్స్ పర్యావరణానికి ముప్పు అంటున్నారు శాస్త్రవేత్తలు. అలాగే గుట్కా వాడకం ఆరోగ్యానికి ప్రమాదకరం. వాటిని నిషేధించే బదులు, అసలా ఫ్యాక్టరీలనే ఎందుకు మూసివేయరు? ఇలాంటి ప్రశ్నలు చాలా అతన్ని చికాకు పెడుతుంటాయి.

కానీ, ఒక ప్రయోజనం కోసం తయారైన వస్తువు, ఏభైశాతం పైగా దుర్వినియోగం కావడమే మన దేశంలో నిత్యం జరుగుతున్న విషయం.

ఎందుకంటే ఇక్కడ జనాలకి వ్యవస్థ మీద గౌరవం లేదు. చట్టం మీద గౌరవం లేదు. చట్టాలు అమలు చేయవలసిన వాళ్లే చెయ్యి చాపుతారు.... ఎక్కడ చూసినా లంచం.... మొత్తం వ్యవస్థను నాశనం చేస్తున్న దుస్థితి ఇది !

ప్రతి మనిషీ ఈ వ్యవస్థ గురించి కొంచెం ఆలోచించినా చాలు ఎంతో మార్పు కనపిస్తుందం టాడు ఋత్విక్. ఆ మాటకి చాలామంది నవ్వి ఊరు కుంటారు.

ఓ రోజు - అరగంటనుంచీ ప్రక్క సీటు కొలీగ్‌తో బాతాఖానీ వేస్తున్న రామారావు సెల్ రింగయ్యింది. "మీ అబ్బాయికి యాక్సిడెంటయ్యింది. ఫలానా ఆసుపత్రిలో ఉన్నాడని" ఫోను. ఆసుపత్రి వాళ్లు ఫోన్ చేశారు.

కంగారుగా లేచాడు. రామారావు. హుషారుగా కబుర్లు చెబుతున్న అతను దాదాపు ఏడుపు ముఖం పెట్టేశాడు. ఏమైందన్నారు కొలీగ్స్. కొడుక్కి యాక్సిండెంటయిన విషయం చెప్పాడు.

ఋత్విక్,ఇంకా కొందరు అతనితో ఆసుపత్రికి వెళ్లారు. వీళ్లు వెళ్లే సరికి అతని కొడుకు అపస్మార కంలో ఉన్నాడు. వేగంగా వెళుతున్న అతన్ని అంతే వేగంగా వస్తున్న కారు ఢీకొందట. కాళ్లకి బాగా దెబ్బలు తగిలాయి. తలకీ తగిలాయి. తీవ్రమైన గాయాలే.

రామారవు బేలగా చూశాడు ఋత్విక్ కేసి. ఏం మాట్లాడాలో అతనికి అర్థం కాలేదు.

"స్పీడుగా వెళ్లకురా అంటే వినడు..." అంతకు మించి మాట్లాడలేకపోయాడు రామారావు.

ఈ తరం స్పీడు యుగం అంటూ వాదించే రామారావు తప్పు చేసిన వాడిలా తల వంచుకుని కూర్చున్నాడు. ఓదార్పుగా అతని భుజం మీద చెయ్యి వేశాడు ఋత్విక్.

అనవసర భయాలతో వీళ్లందర్నీ ఇబ్బంది పెట్టేస్తున్నానా అనుకున్నాడు ఋత్విక్. కానీ, మనస్సు అంగీకరించలేదు. ప్రలోభాలు కొండంత... ప్రయత్నం ఆవగింజంత. అది మొలకై, మహా వృక్షమైనప్పుడే... సమాజానికి మంచి జరుగుతుందనుకున్నాడు.....

"నువ్వంటూనే ఉన్నావ్... నీ మాటలు చాదస్తంగా కొట్టి పారేశాం... అనుభవమైతే గానీ మనిషికి ఏదీ తెలిసిరాదు... కొంచెం నీలా ఆలోచిస్తే చాలు చాలా అనర్థాలు తగ్గుతాయి..." రామారావు అన్నాడు ఒక్కొక్క పదం వత్తి పలుకుతూ.....